సాక్షి
మెదక్
ఆదివారం । 25 । ఆగస్టు । 2024

ఈ ఇళ్లు చూస్తే మతి పోవాల్సిందే.. అతి చౌకకే లగ్జరీ ఇళ్లను తలపిస్తున్నాయి. అందరినీ ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుత రోజుల్లో ఇల్లు నిర్మాణానికి ఎంత లేదన్నా సుమారు రూ.30 లక్షల వరకు వెచ్చిస్తేనే పూర్తి కావడం కష్టం. అలాంటిది కేవలం రూ.4లక్షల లోపే ఇల్లు నిర్మించడం.. అదీ కూడా లగ్జరీగా ఉండటం చూస్తుంటే అవాక్కవాల్సిందే.. ఎందుకంటే చూడటానికి కంటైనర్ అయినప్పటికీ లోపల మాత్రం అదిరిపోయే డిజైన్లతో అందంగా తయారు చేస్తున్నారు. ఒక హాల్, కిచెన్, బెడ్రూమ్, కబోర్డ్స్, అటాచ్డ్ వాష్ రూమ్ తో అదిరిపోతోంది. కంటైనర్ ఇళ్లపై ఈ వారం ప్రత్యేక కథనం.

- గోకెర వేణుగోపాల్‌గౌడ్, పటాన్‌చెరు టౌన్

సండే స్పెషల్



ధర చౌక.. ఇల్లు కేక!

వివరాలు 8లో..

అదిరిపోతున్న కంటైనర్ ఇళ్లు

- సకల సౌకర్యాలతో నిర్మాణం
- ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్లే అవకాశం
- అన్ని కాలాల్లోనూ పూర్తి రక్షణ
- ఆర్డర్ ఇచ్చిన పది రోజుల్లోనే తయారీ
- పటాన్‌చెరు ప్రాంతాల్లో జోరుగా నిర్మాణాలు

న్యూస్‌రీల్

సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ



జైలులో తనిఖీ చేస్తున్న జడ్జి జితేందర్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సూచన మేరకు తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. వంటశాల తనిఖీ చేసి ఆహారం గురించి జైలు పర్యవేక్షణ అధికారితో చర్చించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి ముద్దాయిలకు వివిధ అంశాల పైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులకు కేవలం ఆటల్లోనే కాకుండా చదువులో సైతం నిష్ణాతులుగా తయారు చేయాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి సీతలక్ష్మి ప్రిన్సిపాల్ సుమతికి పలు సూచనలు చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్టీ స్పోర్ట్స్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇక్కడ నిర్వహిస్తున్న క్రీడల శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. పలు విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించారు. వంటశాలను, భోజన గదులను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు కేవలం ఆటల్లోనే కాకుండా చదువులో సైతం నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్‌కు చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ నటరాజ్, డిప్యూటీ కలెక్టర్ రాజేందర్‌రెడ్డి, హైఫై ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు లభించినట్లు డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు భవన్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్ ఇషాక్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ... పటాన్‌చెరు బస్టాండ్‌కు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే బస్టాండ్‌లో బస్సు పాస్ సెక్షన్, కార్గో సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, హైదరాబాద్, సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

కొత్త రుణాలు ఇవ్వండి

సంగారెడ్డి టౌన్: అర్హులందరికీ రైతు రుణమాఫీ చేసి వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి కోరారు. శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. రుణమాఫీ కాని వారి దరఖాస్తులు స్వీకరించి వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యా సంస్థలలో డ్రగ్స్ కట్టడి చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలలో డ్రగ్స్ వినియోగం, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం .. బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, నిఖిల్ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌కు గద్దర్ పేరు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతి

తూప్రాన్: పట్టణ సమీపంలోని కిష్టాపూర్ చెక్‌డ్యాం పై ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌కు 'గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్'గా నామకరణం చేయాలని తీర్మానం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి శనివారం తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందులో హల్దీవాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు 'గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్' గా నామకరణం చేయాలని, పట్టణంలోని 4వ వార్డులోని గాంధీ విగ్రహం ఏర్పాటు, అల్లాపూర్, బ్రాహ్మణపల్లిలో జాతీయ జెండాలను ఏర్పాటు, ఇటీవల పెరిగిన ఆస్తి పన్నులను తగ్గించడానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించాలని తదితర పనులకు తీర్మానం చేసినట్లు తెలిపారు.

ఔను.. అంతా నా ఇష్టం..!

బ్యాంక్ మేనేజర్ ఇష్టారాజ్యం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతుపేరు దుర్గం మాదాగౌడ్. చిన్నశంకరంపేట మండలం జంగారాయి గ్రామం. అతనికి 3 ఎకరాల 27 గుంటల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది జనవరిలో మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి పంట రుణం అడిగితే భూమి ప్రకారం రూ. 1.50 లక్షల పంటరుణం వస్తుందని సదరు బ్యాంకు మేనేజర్ చెప్పారు. అంత వద్దని, తనకు రూ.లక్ష చాలని చెప్పి తీసుకున్నాడు. ఇటీవల రుణమాఫీ కావటంతో మాదాగౌడ్ ఫోన్‌కు రూ.1.50 లక్షలు మాఫీ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బ్యాంకుకు వెళ్లి రుణం రూ.లక్ష అయితే రూ.1.50 లక్షలు ఎలా మెసేజ్ వచ్చిందని నిలదీశారు. వెంటనే రైతుకు మిగతా రూ. 50 వేలు ఇచ్చారు. ఆ డబ్బును హోల్డ్‌లో పెట్టానని పొంతన లేని మాటలు చెప్పాడు.

- అమాయక రైతుల నగదు హోల్డ్
- రుణమాఫీ సొమ్ము జమతో విషయం బహిర్గతం
- వినియోగదారులకు తెలియకుండా ఖాతాల్లో నుంచి డబ్బుల డ్రా
- మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

మెదక్‌జోన్: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో జంగారాయి, శంకరంపేట, చందాపూర్, రుద్రారం, చందంపేట, అంబాజీపేట, కామారం, సూరారం తదితర గ్రామాలున్నాయి. ఇందులో 3 వేల పైచిలుకు రైతులు పంట రుణాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు వివిధ రకాల రుణాలు తీసుకున్నారు. బ్యాంకు టర్నోవర్ సుమారు రూ. 80 నుంచి రూ.100 కోట్లు ఉంటుంది. గతేడాది క్రితం బ్యాంకు మేనేజర్‌గా విజయ్ ఆనంద్ వచ్చారు. ఆయన వచ్చిన నుంచి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్షరజ్ఞానం లేని రైతులను ఆసరాగా చేసుకుని అనేక అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే మీదిక్కున్నచోట చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా బదులిస్తున్నారు. బ్యాంక్ మేనేజర్ తీరుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు తమకు ఎంత రుణం మంజూరైంది.. మేనేజర్ ఎంత మాయచేశారో అర్థం కావడం లేదని వారు వాపోతున్నారు.



మొండిఖాతాలకే హోల్డ్

ఎవరైనా బ్యాంకులో రుణం తీసుకుని సకాలంలో చెల్లించకుండా ఉంటే రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం (ఆర్‌బీఐ) సదరు రైతు సేవింగ్స్ అకౌంట్‌ను హోల్డ్‌లో పెడతారు. కానీ రెగ్యులర్‌గా ఖాతా ఉన్న వారి అకౌంట్‌ను హోల్డ్ పెట్టడం, సదరు రైతుకు మంజూరు చేసిన రుణం మొత్తంలో కొంతే పాస్‌బుక్‌పై రాయడం, మిగతాది గురించి సదరు రైతుకు చెప్పక పోవటం సరైంది కాదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. పంట రుణం తీసుకున్న రైతులు రెగ్యులర్‌గా రెన్యువల్ చేసినా సమాచారం లేకుండా ఇష్టానుసారంగా డ్రా చేయటం సరైంది కాదంటున్నారు. కాగా, మేనేజర్‌పై పూర్తి స్థాయి విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని పలువురు వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.



చిన్నశంకరంపేట ఎస్‌బీఐ బ్యాంకు

అదే గ్రామానికి చెందిన మరో రైతు గత కొంతకాలం క్రితం రూ. 1.50 లక్షల పంట రుణం తీసుకున్నాడు. ఏటా రెన్యువల్ చేస్తున్నాడు. ఈ నెల 23న సదరు రైతుకు తెలియకుండా సేవింగ్స్ అకౌంట్ నుంచి రూ. 1.53 లక్షలు డ్రా అయ్యాయి. దీంతో ఫోన్‌కు మెసేజ్ రావటంతో కంగుతిని బ్రాంచ్ మేనేజర్‌కు ఫోన్ చేసి అడిగారు. పంట రుణం కట్టాలి కదా! తీసుకున్నామని చెప్పాడు. ఖాతా రెగ్యులర్‌గా ఉందని, తెలియకుండా ఎలా డ్రా చేస్తారని ప్రశ్నిస్తే.. సరైన సమాధానం రాలేదు. దీంతో ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఇది వీరిద్దరి సమస్యే కాదు రైతులందరిదీ కూడా..

సంప్రదాయ కోర్సులతో ఉద్యోగావకాశాలు

బిట్స్‌పిలాని డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆదిత్య తదితరులు

నర్సాపూర్: ఇంజనీరింగ్‌లో సంప్రదాయ కోర్సులు చదివిన వారు సైతం ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని బిట్స్‌పిలాని (హైదరాబాద్ క్యాంపస్) డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సౌమ్య ముఖర్జీ చెప్పారు. శనివారం స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ కోర్సులతో చాలా లాభాలు ఉన్నాయన్నారు. బయో మెడికల్ ఇంజనీరింగ్ కోర్సుతో మానవ హృద్రోగ ఆరోగ్య సమస్యలకు ఇంజనీరింగ్ విభాగం పరిష్కారం చూపిస్తోందన్నారు. కాగా ఐఐటీ హైదరాబాద్, స్థానిక బీవీ ఆర్‌ఐటీ విద్యా సంస్థలు బయో మెడికల్ కోర్సులను ప్రారంభించాయన్నారు. విశిష్ట అతిథి శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సాం మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లతో మంచి స్కిల్స్, పని అనుభవం, భావవ్యక్తీకరణ, మంచి పుస్తకాలు చదువుతూ పఠనాశక్తిని పెంచుకుని ముందుకు సాగాలని హితవుపలికారు. అందరికీ ఒత్తిడి ఉంటుందన్నారు. విద్యార్థులకు కూడా ఉంటుందని ధైర్యంగా తట్టుకొని జీవితంలో ముందుకు సాగాలని అన్నారు. తమ సొసైటీలో ఏటా 20 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. మంచి అధ్యాపకులతో బోధన చేపట్టడంతో విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా స్థిర పడటానికి పునాదులు వేసే అవకాశం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రభాకర్‌రావు, వర్మ, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏఓలు అశోక్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు.

ఏడేళ్ల తర్వాత కన్నవారి చెంతకు

- మంజుల, వెంకటాచారి కుటుంబంలో ఆనందం నింపిన 'ముస్కాన్'



మానసిక బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఆపరేషన్ ముస్కాన్ ఆ కుటుంబంలో సంతోషాన్ని నింపింది. ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని తిరిగి కన్నవారిచెంతకు చేర్చింది. దీంతో ఆ కుటుంబం ఆనందడోలికల్లో మునిగితేలుతోంది. ఆ వివరాలు.. నల్లగొండ జిల్లా చండూర్ మండలం పుల్లెములకు చెందిన పడికుడి మంజుల వెంకటాచారి దంపతుల పెద్ద కుమారుడు నాగరాజు మానసిక దివ్యాంగుడు. 2017లో ఇంటి నుంచి తప్పిపోయి మహబుబ్‌నగర్ జిల్లా మరికల్లు మండల కేంద్రంలో తిరుగుతుంటే ఇక్కడి స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. వారు తర్వాత సీడబ్ల్యూసీ ద్వారా శివ్వంపేట మండలం మగ్దుంపూర్‌లోని బేతని ఆశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి ఇక్కడ ఉంటున్నాడు. జూలై 2024 ఆపరేషన్ ముస్కాన్‌లో మిస్సింగ్ కేసుల్లో భాగంగా చౌటుప్పల్, మెదక్ పోలీసులు తప్పిపోయిన బాలుడి వివరాలు దర్పణం యాప్‌లో అప్ చేయడంతో వివరాలు వెలుగులోకి వచ్చాయి. కాగా, తల్లిదండ్రులకు సమాచారం అందించగా శనివారం ఆశ్రమానికి వచ్చి ఏడేళ్ల క్రితం దూరమైన కొడుకు కనిపించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇన్నాళ్లు కొడుకును కంటికి రెప్పలా చూసుకున్న ఆశ్రమ నిర్వాహకుడు, బేతని సంస్థ డైరెక్టర్ సాజీవ్ వర్గీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ బాలల సంరక్షణ అధికారి నాగరాజు సమక్షంలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో ఆశ్రమ క్యాంపస్ ఇన్‌చార్జి విన్సెంట్, సోషల్ వర్కర్ వీరబాబు, సిస్టర్ కార్మల్ తదితరులు ఉన్నారు.

యోగా విజేతలకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లతో విజేతలు

చేగుంట(తూప్రాన్): మండలకేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా విజేతలకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా యోగాసన జిల్లా అధ్యక్షుడు గణేష్ రవికుమార్ మాట్లాడుతూ, జిల్లాలోని పలు మండలాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. ఒక్కో విభాగంలో ముగ్గురు చొప్పున ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరంతా సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, యోగాసన జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, నర్సింహులు, రెఫరీ శ్రీదేవి, పీఈటీలు నరేశ్, మల్లీశ్వరి, ప్రీతి, మమత, బాలరాజు, నవీన్, ప్రవీన్, మనోహర్, సంతోశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి




విద్యార్థి రాజమల్లును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థి రాజమల్లు ఎంపికయ్యాడు. చేగుంట మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థి రాజమల్లుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ అల్లి నరేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, ఆంజనేయులు, శివ, లక్ష్మి, ప్రమోద్, నరేందర్, రాజు పాల్గొన్నారు.

దోమలను తరిమికొడదాం

గిరిజన సంక్షేమ అధికారి నీలిమ

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమ జిల్లా అధికారి నీలిమ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బందితో కలిసి ఆమె సమీక్షించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. దోమల మందు పిచికారీ, సాయంత్ర సమయల్లో ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సంపత్ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా సిబ్బంది జాగ్రత్తగా పనులు చేయాలని కోరారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా గ్రామ ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిజారాణి, ఏఈలు విజయ్‌కుమార్, నీల, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలిమ

గ్రంథాలయానికి సమస్యల గ్రహణం

నర్సాపూర్‌లోని లైబ్రరీలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. కొత్త భవనంలో సరైన మౌలిక సదుపాయాలు లేవు. పాత ఫర్నిచర్‌తోనే నెట్టుకొస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పిన మాటలు నీటిమీద రాతలుగానే మిలిగాయి. లైబ్రేరియన్ డిప్యుటేషన్‌పై వెళ్తుంటారు. దీంతో పుస్తకాల గదికి తాళం వేసుకుని వెళ్తారు. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

- అసంపూర్తిగానే కొత్త భవనం
- మౌలిక సదుపాయాల కొరత
- కొత్త ర్యాక్స్ రాక.. నేలపైనే పుస్తకాలు



నర్సాపూర్‌లోని లైబ్రరీ భవనం

నర్సాపూర్: నర్సాపూర్‌లోని లైబ్రరీ సొంత భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని ఖాళీ చేసి అద్దె భవనంలోకి మార్చారు. అనంతరం లైబ్రరీకి కొత్త భవనం నిర్మించేందుకు రాజా రాంమోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ సంస్థ నుంచి రూ. 50 లక్షలు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి రూ.40 లక్షలు మంజూరు చేసింది. దీంతో లైబ్రరీకి కొత్త భవనం నిర్మాణ పనులు చేపట్టగా పనులు నత్తనడకన సాగాయి. గతేడాది ఎన్నికల కోడ్ వస్తుందన్న నెపంతో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అక్టోబర్ 6న ఆగమేఘాల మీద అసంపూర్తిగా ఉన్న భవనాన్నే ప్రారంభించి అన్ని వసతులు కల్పిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత అద్దె భవనంలోనే కొనసాగించి ఈ ఏడాది మేలో కొత్త భవనంలోకి మార్చారు.

పుస్తకాలు నేలపైనే

లైబ్రరీలో 13,494 పుస్తకాలు ఉండగా 1,482 మంది సభ్యులు ఉన్నారు. కొత్త ర్యాక్స్ రానందున పాత ర్యాక్స్‌పై కొన్ని పుస్తకాలు పెట్టి మిగతా పుస్తకాలను నేలపైనే పెట్టారు. కొన్నింటిని బస్తాలలో నింపి మూలన ఉంచారు. కొత్త కుర్చీలు, టేబుళ్లు రానందున పాత కుర్చీలు, టేబుళ్లతోనే నెట్టుకొస్తున్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు కొన్ని మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని, అందులోను లేటెస్ట్ వెర్షన్‌లో పుస్తకాలు లేవనే ఆరోపణలున్నాయి. కాగా, స్థానిక లైబ్రేరియన్ యాదగిరికి అదనంగా మెదక్ లైబ్రరీ బాధ్యతలు అప్పగించారు. దీంతో వారంలో రెండు రోజులు నర్సాపూర్‌లో మిగిలిన నాలుగు రోజులు మెదక్‌లో విధులు నిర్వహిస్తున్నారు. లైబ్రేరియన్ మెదక్‌కు వెళ్లినప్పుడు స్థానిక లైబ్రరీలోని పుస్తకాల గదికి తాళం వేసుకుని వెళ్లడంతో పాఠకులకు న్యూస్ పేపర్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. అలాగే.. కొత్త లైబ్రరీ భవనంలోనూ కనీస వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠకుల సంఖ్య క్రమేపి తగ్గుతోంది.

వసతులు కల్పించేందుకు కృషి:



నర్సాపూర్ లైబ్రరీలో అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఫర్నిచర్, ఇతర వసతులు కల్పిస్తాం. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు రాష్ట్ర సంస్థ నుంచి రాగానే ఇక్కడికి పంపుతాం.

వంశీకృష్ణ,
జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ముకుందా.. మురారీ



చల్మెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు

నిజాంపేట మండలం చల్మెడలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం వైభవంగా కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల కృష్ణ, గోపికల వేషాధారణ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాల హెచ్‌ం సతీష్ కుమార్, ఉపాధ్యాయులు మోహన్, మమత, నవీన్ రత్నాకర్, జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు. -నిజాంపేట(మెదక్)

చెట్టు నరికితే.. చేటు



టేక్మాల్ పాఠశాల ఎదుట నరికేసిన చెట్లు

టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందున్న రోడ్డుపక్కన గతంలో మొక్కలను నాటారు. అవి పెరిగి పెద్దగా అయ్యాయి. విద్యుత్ వైర్లకు తాకుతున్నాయని ఆ శాఖ అధికారులు చెట్లను నరికేశారు. కొమ్మలను నరకాల్సిందిపోయి చెట్లను పూర్తిగా నరికి వేయడంపై స్థానికులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -టేక్మాల్(మెదక్):

క్లుప్తంగా

మానవ హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సుభాషిని

పటాన్‌చెరు టౌన్‌: విద్యార్థులు మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు, అడ్వకేట్‌ సుభాషిని అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బాలికల గురుకుల పాఠశాలలో హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ సంస్థ ఉమ్మడి మెదక్‌ జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్‌ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై, హక్కులపై అవగాహన కలిగి ఉండి, ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ బీనా శివశంకర్‌ గౌడ్‌, అరవింద్‌, వెంకట్‌, దిలీప్‌, పవన్‌, వేణు సంపత్‌ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణపై ఫిర్యాదు

మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన బాధితులు

దుబ్బాక: కుల బహిష్కరణకు గురి చేసి నా భర్త బండమీది సాయిలు చావుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని భూంపల్లి అక్బర్‌పేట మండలం బొప్పాపూర్‌కు చెందిన బాధితురాలు పోచవ్వ శనివారం రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌తో పాటు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్‌తోపాటు సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నెల రోజుల కిందట గ్రామంలోని మా కులస్తులు లేనిపోని చిన్నచిన్న సమస్యలు సృష్టించి 9వ తేదీన మా బావ బండ మీది మల్లయ్య, మా కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నా భర్త చనిపోతే అంతిమయాత్రకు డప్పు కొట్టేందుకు కూడా రాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో చెల్లాపూర్‌ నుంచి డప్పులు తెప్పించి గ్రామస్తులు, మా బంధువుల సహకారంతో నా భర్త అంత్యక్రియలు నిర్వహించామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సాయిలు అన్న బండమీది సాయిలు, డీబీఎఫ్‌ జాతీయ కార్యదర్శి శంకర్‌,ఎమ్మార్పీఎస్‌ నాయకులు ఇస్తారిగల్ల ఎల్లం, ఉన్నారు.

దంపతుల అదృశ్యం

సంగారెడ్డి టౌన్‌: భార్యాభర్తలిద్దరూ అదృశ్యమైన ఘటన శనివారం సంగారెడ్డి పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ భాస్కర్‌ కథనం మేరకు.. నాగయ్య, సురేఖ దంపతులిద్దరూ కుమారుడు సాయికుమార్‌, కోడలు స్వర్ణలతతో కలిసి సంగారెడ్డి పట్టణం సంతోష్‌నగర్‌ కాలనీలో ఉంటున్నారు. 21వ తేదీన కుమారుడు, కోడలు గొడవ పడుతుండగా తల్లిదండ్రులు అడ్డు వెళ్లారు. అదే కోపంలో కుమారుడు వారిని తిట్టాడు. మరుసటి రోజు ఉదయం నాగయ్య, సురేఖ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లారు. సాయికుమార్‌ పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు.

ధర చౌక.. ఇల్లు కేక!

అదిరిపోతున్న కంటైనర్‌ ఇళ్లు

- సకల సౌకర్యాలతో నిర్మాణం
- ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్లే అవకాశం
- అన్ని కాలాల్లోనూ పూర్తి రక్షణ
- ఆర్డర్‌ ఇచ్చిన పది రోజుల్లోనే తయారీ
- పటాన్‌చెరు ప్రాంతాల్లో జోరుగా నిర్మాణాలు



కంటైనర్‌తో జీప్లస్‌ వన్‌ కార్యాలయం

మనం ఎక్కడికెళ్తే.. అక్కడికే ఇంటిని తీసుకెళ్లొచ్చు. అదే కంటైనర్‌ ఇల్లు. ప్రస్తుతం మధ్య తరగతి కుటుంబం ఇల్లు నిర్మాణం చేసుకోవాలంటే ఎంత లేదన్నా రూ.25 నుంచి రూ.30 లక్షలు ఖర్చు అవుతుంది. ఇప్పుడున్న ధరలతో పోలిస్తే అది కూడా తక్కువే. అలాంటిది తక్కువ ధరతో లగ్జరీగా ఉన్న ఈ ఇల్లును చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే చూడటానికి కంటైనర్‌ అయినప్పటికీ లోపల మాత్రం అదిరిపోయే డిజైన్లతో అందంగా తయారు చేశారు. నిర్వాహకులు కూడా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రోజుల వ్యవధిలోనే తయారు చేసి ఇస్తున్నారు.

– పటాన్‌చెరు టౌన్‌

పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో కంటెనర్‌ల ఇళ్ల జోరు కనిపిస్తుంది. తక్కువ ఖర్చుతో ఒక చోట నుంచి మరో చోటికి తరలించేందుకు వీలుగా ఉండటంతో ఎక్కువ మంది వీటిపైనే ఆసక్తి చూపిస్తున్నారు. చిన్న డబ్బాలో అందంగా ఇల్లు నిర్మించి ఇస్తున్నారు. ఒక హాల్‌, కిచెన్‌, బెడ్‌ రూమ్‌, కబోర్డ్స్‌, అటాచ్డ్‌ వాష్‌ రూమ్‌తో అదిరిపోతుంది. ప్రధానంగా ఫామ్‌ హౌస్‌లు, కాఫీ షాపులు, టీ స్టాళ్లు ఎక్కడ చూసినా కనిపిస్తుంటాయి. ఖర్చు చెదరపు అడుగుకు రూ.వెయ్యి ఉండటంతో చిన్నపాటి గూడు నిర్మించుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, కంటైనర్‌ హోమ్‌ అనగానే భయపడాల్సిన అవసరం లేదని ఎండా, వాన పై కప్పుతో పాటు విద్యుదాఘాతం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కంటైనర్‌ హోమ్స్‌ తయారీ చేసే నిర్వాహకులు మొహ్మద్‌ నహీం చెబుతున్నారు. రూ.1.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు కంటైనర్‌ హోమ్‌ తయారీ చేస్తామని చెప్పుకొచ్చాడు.

ఆరు నెలల్లో 300 కంటైనర్‌ హోమ్స్‌



పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో ఉన్న కంటైనర్‌ హోమ్స్‌కు సంబంధించిన మూడు కేంద్రాల్లో 18 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరు ఆరు నెలల్లో 300 కంటైనర్‌ హోమ్స్‌ను విక్రయించారు. ప్రస్తుతం 15 ఆర్డర్‌ ఉన్నాయని వాటిని తయారు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆరేళ్లలో 2,500 కంటైనర్‌ విక్రయించినట్లు నిర్వాహకులు మొహ్మద్‌ నహీం తెలిపారు.



కొల్లూరిలోని ఓ ఫామ్‌ హౌస్‌లో ఏర్పాటు చేసిన కంటైనర్‌ ఇల్లు

పొలాలు, ఫామ్‌ హౌస్‌ల వద్ద..

ఇల్లు కదులుతాయి అంటే అందరికీ ఆశ్చర్యంగా అనిపిస్తుంది. చాలా మంది ఉద్యోగులు విరమణ పొందిన తర్వాత సొంత గ్రామాల్లో పొలాల వద్ద వ్యవసాయం చేసుకుంటూ ఉండాలని అనుకుంటారు. అక్కడ ఇల్లు నిర్మించడం కుదరదు కాబట్టి.. చాలా వరకు కంటైనర్‌ హోమ్స్‌ వైపు చూస్తున్నారు. రూ.లక్షన్నర పెట్టి కంటైనర్‌ హోమ్స్‌ను పొలం వద్ద ఏర్పాటు చేయించుకుంటున్నారు.అదే విధంగా ఫామ్‌ హౌస్‌ ల వద్ద ఏర్పాటు చేసుకొని సరదాగా స్నేహితులతో వారంలో ఒక రోజు గడిపేందుకు చూస్తున్నారు.

పది రోజుల్లో తయారు



కస్టమర్స్‌ కోరిన విధంగా హాల్‌, కిచెన్‌, బెడ్‌రూమ్‌ ఇలా అన్ని సౌకర్యాలతో కంటైనర్‌ ఇంటిని పది రోజుల్లో తయారు చేసి ఇస్తున్నాం. కంటైనర్‌ హోమ్‌లు రూ.1.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉన్నాయని, తక్కువ సమయంలో అందుబాటులోకి వచ్చే కంటైనర్‌ ఇళ్లకు ప్రస్తుతం డిమాండ్‌ పెరిగింది. పటాన్‌చెరు డివిజన్‌తో పాటు బర్కత్‌పూర్‌, విజయవాడ ఈ మూడు చోట్ల తయారు చేస్తున్నామన్నారు.

–మొహ్మద్‌ నహీం, కంటైనర్‌ హోమ్స్‌ నిర్వాహకుడు

మనం నచ్చినట్లు ఇల్లు



ఈ మధ్యకాలంలో కంటైనర్‌ ఇళ్లకు మంచి డిమాండ్‌ ఉంది. మన అభిరుచికి అనుగుణంగా రెడీమేడ్‌ ఇంటిని తయారు చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఆధునిక ఇంటిని తయారు చేసుకోవడమే కాకుండా దాన్ని ఎక్కడికైనా తీసుకొని పోయే వీలుగా ఉంటుంది. అనేక మంది దుకాణాలు కానీ, ఆఫీసులో, వ్యవసాయ క్షేత్రంలో ఇల్లు కోసం దీనిని ఎక్కువగా వాడుతున్నారు. వీటికి మంచి డిమాండ్‌ ఉంది.

–కొల్లూరి భరత్‌, కౌన్సిలర్‌ తెల్లాపూర్‌

కంటైనర్‌ హోమ్‌ తయారీ..



- గల్వ నైజింగ్‌ స్టీల్‌, ఎండీఎఫ్‌ బోర్డులను వీటి తయారీకి ఉపయోగిస్తారు.
- గ్రిడ్‌ వేస్తూ బైసన్‌ బోర్డులతో మూడు లేయర్లుగా ఫ్లోర్లను తీర్చిదిద్దుతున్నారు.
- ఫ్లోర్‌ మొత్తం వాటర్‌ ప్రూఫ్‌ మెటీరియల్‌ వాడడంతో నీరు పడి పాడైపోతుందని సమస్య ఉండదు.
- టీవీ యూనిట్‌, ఏసీ ఏర్పాటుకు అవసరమైన వ్యవస్థ, అవసరమైన స్విచ్‌ బోర్డులు కంటైనర్‌ హోమ్‌లో తయారు చేసే సమయంలో ఏర్పాటు చేస్తున్నారు.
- కంటైనర్‌ హోమ్‌లో షార్ట్‌ సర్క్యూట్‌కి అవకాశం లేకుండా పైపులను అమర్చుతో అందులో నుంచి వైర్లను పవర్‌ యూనిట్‌కు అనుసంధిస్తున్నారు.
- కంటైనర్‌ పై భాగంలో 50 ఎమ్ఎమ్‌ ఇన్సులేషన్‌ చేయడంతో షార్ట్‌ సర్క్యూట్‌కు అవకాశం ఉండదు.
- ఆర్డర్‌ ఇచ్చిన 10 రోజుల్లోనే ఇల్లు తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, అదనపు వాటి కోసం అదనపు ఖర్చులు.

మానవత్వం చాటుకున్న మహిళా కండక్టర్‌

బస్సులో పోగొట్టుకున్న బంగారం అప్పగింత



బాధితురాలికి బంగారాన్ని అందిస్తున్న కండక్టర్‌ దేవమ్మ

దుబ్బాకటౌన్‌: ఆర్టీసీ బస్సు మహిళా కండక్టర్‌ తన మానవత్వాన్ని చాటుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన దేవమ్మ దుబ్బాక బస్‌ డిపో పరిధిలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. శనివారం దుబ్బాక నుంచి కామారెడ్డి వెళ్లే బస్సులో దుబ్బాక మున్సిపల్‌ ధర్మాజీపేటకు చెందిన సంగని రాజమని పని నిమిత్తం బీబీపేటకు వెళ్లింది. రాజమని బస్సులోనే మూడున్నర తులాల బంగారం, రూ.3 వేలతో ఉన్న పర్సును మర్చిపోయి దిగిపోయింది. కొంత సమయం తర్వాత పర్సును గమనించిన కండక్టర్‌ తీసుకొని డిపోలో అప్పగించింది. విషయం తెలుసుకున్న బాధితురాలు దుబ్బాక బస్సు డిపోకు వచ్చింది. డిపో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ లింగం, కండక్టర్‌ బాధితురాలికి పర్సును, బంగారాన్ని అందించారు. మానవత్వంతో బాధితురాలికి పర్సు అందించిన కండక్టర్‌ను పలువురు ప్రశంసించారు. ఈ విషయంపై కండక్టర్‌ దేవమ్మను రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ గౌడ్‌ అభినందించారు.

దొరికిన ఫోన్‌ అందజేత



ఫోన్‌ అప్పగిస్తున్న పోలీసు సిబ్బంది

సంగారెడ్డి జోన్‌: పోగొట్టుకున్న మొబైల్‌ ఫోను వ్యక్తికి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు పోలీసు సిబ్బంది. శుక్రవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ మహేందర్‌, హోం గార్డు లక్ష్మణ్‌ పట్టణంలోని టీవీఎస్‌ షోరూం ముందు ఓ మొబైల్‌ ఫోన్‌ పడి ఉండడం గమనించారు. దొరికిన ఫోన్‌ పోలీస్‌ స్టేషన్లో అప్పగించగా సదాశివపేట మండల పరిధిలోని ఆరు గ్రామానికి చెందిన మనోజ్‌ కుమార్‌దిగా గుర్తించి ఫోన్‌ ను అప్పగించారు. నిజాయితీ చాటుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ చెన్నూరు రూపేశ్‌ అభినందించారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- ఇద్దరు దొంగలు అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్‌: పట్ట పగలే చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో బైక్‌పై అనుమానంగా ఉన్న తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. మెదక్‌ జిల్లా హవేలీఘనపూర్‌ గ్రామానికి చెందిన గోకన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, మరాటి ప్రశాంత్‌ అనే ఇద్దరు స్నేహితులు జల్సాలకు అలవాటి పడి తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మనోహరాబాద్‌ మండలంలోని జీడిపల్లిలో ఈ నెల 8న, తూప్రాన్‌ మండలంలోని నాగులపల్లిలో 10న దొంగతనాలకు పాల్పడడంతో పాటు మేడ్చేల్‌లో మూడు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారం, 43 తులాల వెండి, రూ.20 వేల నగదు, బైక్‌తోపాటు దొంగతనాలకు ఉపయోగించిన ఇనుపరాడ్‌ను రికవరీ చేశామన్నారు. కేసులను ఛేదించిన సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం, మనోహరాబాద్‌ ఎస్‌ఐ సుభాష్‌, సిబ్బందిని ప్రశంసించారు.

మహేంద్ర కంపెనీలో చోరీ..

జహీరాబాద్‌ టౌన్‌: మహీంద్ర అండ్‌ మహీంద్ర కంపెనీలో చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. టౌన్‌ ఎస్‌ఐ.కాశీనాథ్‌ కథనం మేరకు.. మహారాష్ట్రలోని పూణేకి చెందిన విజయ్‌ గౌతం త్రిభూవన్‌(36), అమర్‌ భీంరావు(31) రెండు నెలల కిందట మహీంద్ర కర్మాగారంలో దొంగతనం చేశారు. విలువైన ఇంజెక్టర్‌ పార్ట్స్‌ను ఎత్తుకెళ్లారు. కర్మాగారం యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నమ్మదగిన సమాచారం మేరకు పట్టణంలోని హైదరాబాద్‌ లాడ్జిను తనిఖీ చేయగా ఓ రూమ్‌లో విజయ్‌ గౌతం త్రిభూవన్‌, అమర్‌ భీంరావు దొరికారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా మహీంద్రా కంపెనీలో ఇంజెక్టర్‌ పార్ట్స్‌ చోరీ చేసి పూణేలో విక్రయించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద రూ.1.70 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని శనివారం కోర్టులో రిమాండ్‌ చేశామని ఎస్‌ఐ. వివరించారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి



వైష్ణవి (ఫైల్‌)

కౌడిపల్లి(నర్సాపూర్‌): పాముకాటుతో విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తాండ్ర స్వప్న, వీరేశంకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు వైష్ణవి(12) గ్రామంలో ఏడవ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగా శనివారం రాత్రి వారి సొంత పెంకుటింట్లో పడుకున్నారు. అర్ధరాత్రి వైష్ణవి కాలికి ఏదో కరిచినట్లు అనిపించడంతో తల్లిదండ్రులకు చెప్పింది. పక్కన నూనె కట్ల పాము ఉండటంతో పామును చంపి వైష్ణవిని చికిత్స నిమిత్తం మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని పస్తాపూర్‌ చౌరస్తా సమీపంలో రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు జహీరాబాద్‌ టౌన్‌ ఎస్‌ఐ. కాశీనాథ్‌ తెలిపారు. మృతుడి వయస్సు 58 ఏళ్లు ఉంటుందని, వంకాయ కలర్‌ షర్టు ధరించాడని, మిత్ర దాబా వద్ద పడి ఉన్నాడని, ముఖంపై గాయాలు కావడంతో రక్తస్రవం జరిగిందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్‌ ఆస్పత్రికి తరలించామన్నారు. గుర్తు పడితే 8712 656763 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మురికి గుంతలో పడి వ్యక్తి..

చేగుంట(తూప్రాన్‌): ప్రమాదవశాత్తు మురికి గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. వడియారం గ్రామానికి చెందిన కుర్ర అశోక్‌(35) మంగళవారం రోజు ఇంట్లోంచి కనిపించకుండా పోయాడు. గురువారం అతడి భార్య నాగరాణి తనభర్త కనిపించడం లేదని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం రోజు వడియారం సీఎస్‌ఐ చర్చి సమీపంలో మురికి గుంతలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ బాలరాజు చనిపోయిన వ్యక్తి అశోక్‌గా గుర్తించారు. మద్యం మత్తులో మురికి గుంతలో పడి అశోక్‌ మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచి నీళ్లు అడిగి.. బంగారం చోరీ

నర్సాపూర్‌రూరల్‌: వృద్ధురాలిని మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన శనివారం నర్సాపూర్‌ పట్టణంలోని శ్రీరామ్‌ నగర్‌ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. 60 ఏళ్ల వృద్ధురాలు కొడకంచి దుర్గమ్మ ఇంటి ఎదుట నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మంచి నీళ్లు కావాలని అడిగాడు. దుర్గమ్మ నీళ్లు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్తుండగా వెనుక నుంచి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. దుర్గమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెతకగా దొంగ అప్పటికే పారిపోయాడు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాకరూరల్‌: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పద్మనాభునిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్‌ కథనం మేరకు... గ్రామానికి చెందిన ముక్కపల్లి కనకయ్య(38) మూడేళ్ల కిందట అప్పులు చేసి వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌, క్వాలీస్‌ వాహనాన్ని కొనుగోలు చేశాడు. అప్పులు ఎక్కువ కావడం మళ్లీ వాటిని అమ్మి తీర్చాడు. అప్పులు పూర్తి స్థాయిలో తీర్చలేక మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంటి అరుగు మీద పడుకొని వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో ఆటోలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహలోకి వచ్చాక గ్రామ శివారులోని చెరువు వద్ద మద్యంలో విషపూరిత మందు కలుపుకొని తాగానని కుటుంబీకులకు తెలిపాడు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో దూకి వివాహిత..

– దండుపల్లి వద్ద ఘటన



ఉమ (ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వర్గల్‌ మండలం దండుపల్లిలో జరిగింది. బేగంపేట ఏఎస్‌ఐ అమృత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్‌ మండలం దండుపల్లికి చెందిన నీల స్వామి, శ్యామల దంపతుల చిన్న కూతురు ఉమ(19)కు ఐదు నెలల కిందట రాయపోల్‌ మండలం రాంసాగర్‌కు చెందిన చిత్తారి కమలమ్మ, నర్సింలు దంపతుల కుమారుడు శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. ఇటీవల రాఖీ పండుగ సందర్భంగా కూతురిని స్వామి ఇంటికి తీసుకొచ్చాడు. అప్పటి నుంచి తల్లిగారింటి వద్దే ఉంటుంది. శనివారం ఉదయం తల్లిదండ్రులు పొలానికి వెళ్లారు. ఇంటి వద్దే ఉన్న కూతురు ఉమ దండుపల్లి–మజీద్‌పల్లి వెళ్లే మార్గంలోని బోయినమ్మ చెరువు వద్దకు వెళ్లి చెప్పులను, సెల్‌ఫోన్‌ను గట్టుమీద వదిలేసి చెరువులో దూకి బలవన్మరణం చెందింది. విషయం తెలిసి కుటుంబీకులు బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువులో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలి మామ అసభ్యకర ప్రవర్తన, అత్త, భర్త మానసిక వేధింపుల కారణంగా తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో ప్రయాణం గొప్పది

ఇస్రో మాజీ సీనియర్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ మృత్యుంజయరెడ్డి



మాట్లాడుతున్న మృత్యుంజయరెడ్డి, పక్కన బీఎస్‌మూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భారత అంతరిక్ష పరిశోదన సంస్థ (ఇస్రో) ప్రయాణం చాలా గొప్పదని, ఇది పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలతో పాటు, సామాన్యులపై కూడా తనదైన ముద్ర వేసిందని ఇస్రో మాజీ సీనియర్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ కె.మృత్యుంజయరెడ్డి పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌ ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో అంతరిక్ష పరిశోధనల్లో ఎంతో ముందుందని అన్నారు. ఐఐటీ హైదరాబాద్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ బీ.ఎస్‌.మూర్తి మాట్లాడుతూ గ్రహాలు, నక్షత్రాల గురించి వివరణాత్మక అధ్యయనాలను ప్రారంభించేందుకు, తద్వారా అంతరిక్షంపై పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఐఐటీహెచ్‌లో అధునాతన టెలిస్కోప్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 424 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు విద్యార్థులు వినూత్న ఆలోచనలతో రాకెట్లు, స్పేస్‌షిప్‌ల నమూనాలను రూపొందించారు. ఈ సందర్భంగా పెయింటింగ్‌ పోటీలు, కంటెంట్‌ క్రియేషన్‌, స్పేస్‌థీమ్‌ల ఆధారంగా వీడియో బ్లాగింగ్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజిక్స్‌ డిపార్ట్‌మెంట్‌ ప్రొఫెసర్‌ మయూక్తాపహారీ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రీడీ ప్రింటింగ్‌పై అంతర్జాతీయ సింపోజియం

హైదరాబాద్‌ ఐఐటీ, ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్‌ యూనివర్సిటీలు సంయుక్తంగా త్రీడీ ప్రింటింగ్‌పై అంతర్జాతీయ సింపోజియంను ప్రారంభించినట్లు హైదరాబాద్‌ ఐఐటీ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ బీ.ఎస్‌.మూర్తి మాట్లాడుతూ ఈ రెండు విద్యా సంస్థలు రెండు దేశాల అభివృద్ధికి పరస్పరం సహాయ సహకారాలు అందించుకుని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీకిన్‌ యూనివర్సిటీ ప్రొ వైస్‌ ఛాన్సిలర్‌ ప్రొఫెసర్‌ కె.భాస్కరణ్‌ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్ట్‌

వర్గల్‌(గజ్వేల్‌): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్‌, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం వర్గల్‌ మండలం శాకారం చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శాకారం చౌరస్తా వద్ద నిషేధిత గంజాయిని అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ జానకీరాంరెడ్డి, గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి బృందం అక్కడికి చేరుకున్నారు. మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా రాజబొల్లారం తండాలో ఉంటున్న (ఒడిశా రాష్ట్ర వాసి) జగదీష్‌ భీర(26), ప్రశాంత బిస్వాల్‌ (34) అనుమానాస్పద స్థితిలో పోలీసులకు కనబడ్డారు. వారి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా 300 గ్రాముల నిషేధిత గంజాయి దొరికింది. వెంటనే ఇద్దరిని అరెస్ట్‌ చేసి గంజాయితోపాటు ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులు ఒడిశాకు చెందిన రంజిత్‌ వద్ద గంజాయి కొనుగోలు చేసి వర్గల్‌ ప్రాంతంలో యువకులకు, లేబర్‌కు అమ్ముతున్నట్లు పేర్కొన్నారు.

కూతురి వైద్యానికి వెళ్లొస్తుండగా తల్లి మృతి

- బీభత్సం సృష్టించిన కారు
- ముందు వెళ్తున్న కారును తప్పించబోయి మరో రెండు కార్లను ఢీ
- మహిళ మృతి, ఆరుగురికి గాయాలు



ధ్వంసమైన కారు

కౌడిపల్లి(నర్సాపూర్‌): కౌడిపల్లిలో కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం తునికి గేట్‌ సమీపంలో 765డి జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం దడిగి గ్రామానికి చెందిన బీరుగౌండ, అతడి భార్య అశ్విని(35), కుమారుడు, డ్రైవర్‌ గంగుతో కలిసి కూతురు సింధూజ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వైద్యానికి కారులో హైదరాబాద్‌ వెళ్లి తిరిగి ఇంటికొస్తున్నారు. తునికి గేట్‌ సమీపంలోకి రాగానే ఓ కారును ఓవర్‌ టెక్‌ చేసే క్రమంలో ముందు వెళ్తున్న కారును ఢీకొని, అంతటితో ఆగకుండా హైదరాబాద్‌ వైపు వెళ్తున్న మరో కారును ఢీకొన్నాయి. దీంతో అశ్వినికి తీవ్రగాయాలు కాగా కారు అద్దంలో ఇరుక్కుపోయింది. డ్రైవర్‌ గంగు, సింధూజకు గాయాలు అయ్యాయి. ఇందులో సంతోషదేవి, భర్త దేవారంచౌదరి, మరోకారులో ఉన్న రమాదేవికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి పరీక్షించిన వైద్యులు అశ్విని మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు.